క్లుప్తంగా

సింహగిరిపై ఏకాదశి తిరువీధి



తిరువీధిలో ఉత్సవమూర్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం సాయంత్రం మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులకు విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. ఆలయ బేడామండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున హారతులు అందించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

25 నుంచి శ్రీచక్ర సహిత రాజేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని గణపతి, సుబ్రహ్మణ్య, శ్రీచక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి చతుర్థ వార్షికోత్సవాన్ని ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న ఉదయం ఆలయ ప్రదక్షిణ, గోపూజ, భూతబలి, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రుత్విక్‌వరణ, దీక్షధారణ, అస్త్రరాజార్చన, ప్రధాన కుంభవాహన, మధ్యాహ్నం ధ్వజారోహణ, నీరాజన మంత్రపుష్పములు, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 26, 27 తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వర్షంతో ఉపశమనం



పి.బోనంగి రహదారిలో భారీగా చేరిన వర్షపు నీరు

పరవాడ: మండలంలోనిపలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. కొన్ని రోజులుగా మండుతున్న ఎండలతో విలవిల్లాడిన ప్రజలు సోమవారం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి ఊపిరి పీల్చుకున్నారు. వర్షానికి పరవాడ, వీఎల్‌ఎన్ పురం, వాడచీపురుపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపై భారీగా నీరు చేరింది. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కురిసిన వర్షం ఇటీవల నాటిన గంటి, సరుగుడు, యూకలిప్టస్ మొక్కలకు ఊపిరిపోసింది.

వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం



కనకారావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న గంగాధర్

సబ్బవరం: అనారోగ్యంతో బాధపడుతున్న వంగలి వీఆర్‌ఏ ఎస్.కనకారావుకు సబ్బవరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కనకారావు త్వరగా కోలుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు ఆకాంక్షించారు. ఆస్పత్రిలో ఉన్న కనకారావును వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు నీటిపల్లి గంగాధర్ పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సాయాన్ని అందించారు.

'సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందిస్తున్నాం'

పెందుర్తి: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని గుర్రంపాలెం పంచాయతీలో టీడీపీ ఆధ్వర్యంలో 'సుపరిపాలన-ముందడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం మంత్రి పాల్గొని ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

అగనంపూడి: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా స్థాయి పోటీలు ఈనెల 27న పరవాడ మండలం వెన్నెలపాలెంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా రవిశంకర్, సీహెచ్.అంజనేయులు తెలిపారు. పోటీలు సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఉంటాయని, పదేళ్ల నుంచి 55 ఏళ్ల లోపు వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నామని చెప్పారు. ఇతర వివరాల కోసం 93987 40982, 78010 83283 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

కలగానే.. ఈఎస్ఐ ఆస్పత్రి

పారిశ్రామిక వాడ.. పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు.. చాలా ఏళ్లుగా కార్మికుల కల. వందకు పైగా పరిశ్రమలున్న ఫార్మాసిటీతోపాటు, ఎన్టీపీసీ, ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏ చిన్న ప్రమాదం సంభవించినా.. క్షతగాత్రులను ఇటు విశాఖ లేదా అటు అనకాపల్లికి తీసుకెళ్లాల్సిన దుస్థితి. మార్గమధ్యలోనే గాల్లో కలిసిన ప్రాణాలెన్నో..! మరోవైపు కార్మికుల కుటుంబ సభ్యులకు అనారోగ్యం సంభవిస్తే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి చేతి చమురు వదిలించుకునే దుస్థితి. వీటన్నింటికీ చెక్ పెట్టాలంటే ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటే శరణ్యమని కార్మికుల ప్రధాన డిమాండ్.



జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ వ్యూ

- పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రికి కార్మికుల డిమాండ్
- దశాబ్దాలుగా పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఏ చిన్న ప్రమాదం జరిగినా విశాఖ, అనకాపల్లి టౌన్‌కు పరుగులు

పరవాడ:

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని కొన్నేళ్లుగా కార్మిక వర్గం మొరపెట్టుకుంటోంది. అయినా తమ అభ్యర్థనను పట్టించుకునే నాథుడే లేడంటూ వాపోతోంది. ఇక్కడ పరవాడ ప్రాంతంలో జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, ఇండస్ట్రియల్ పార్క్ వంటి పరిశ్రమలు ఏర్పాటై పాతికేళ్లు దాటింది. జేఎన్ ఫార్మాసిటీలోనే 108 పరిశ్రమల్లో సుమారు 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. సింహాద్రి ఎన్టీపీసీలో 1600 మంది కార్మికులున్నారు. వీరంతా ఈఎస్ఐ చెల్లిస్తున్నారు. అయినా వాటి ప్రయోజనాలు పూర్తిగా పొందలేకపోతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు

ఇక్కడి పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో క్షతగాత్రులైన కార్మికులకు అత్యవసర వైద్య సేవలందించేందుకు స్థానికంగా ఎలాంటి ఆస్పత్రులూ లేవు. ఏ చిన్న ప్రమాదం జరిగినా బాధితులను విశాఖ, అనకాపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించడానికి అంబులెన్స్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే. స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి సదుపాయం లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు కూడా మెరుగైన వైద్య సేవలు పొందలేని పరిస్థితి. వీరికి ఏదైనా ఆనారోగ్య సమస్య తలెత్తితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తోంది.

ప్రారంభించకుండానే మూసేశారు

కార్మికులు ఎదుర్కొంటున్న అవస్థల నేపథ్యంలో పరవాడ ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కార్మిక వర్గాలు కొన్నేళ్లుగా గగ్గోలు పెడుతున్నా ఈఎస్ఐ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టని పరిస్థితి. గతంలో పరవాడలో ఈఎస్ఐ అధికారులు తాత్కాలిక ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేసి, దాన్ని తెరవకుండానే ఇటీవల మూసేశారు. ఫలితంగా ఏ చిన్న ప్రమాదం జరిగినా, అనారోగ్య సమస్యలు తలెత్తినా దూర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సింహాద్రి ఎన్టీపీసీ

చేతి చమురు వదులుతోంది



పరిశ్రమలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే అత్యవసర వైద్యం కోసం దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులపై ఆధారపడాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకు వెళ్లే లోపు చాలా మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. మా కుటుంబ సభ్యులకు ఏవైనా అనారోగ్య సమస్యలు వచ్చినా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యానికి చేతి చమురు వదులుతోంది.

– పి.గోవిందరాజు, కాంట్రాక్టు కార్మికుడు, ఎన్టీపీసీ

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



ఫార్మాసిటీలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్యం పొందేందుకు ఐఆర్ కార్డులున్నా ప్రయోజనం లేదు. స్థానికంగా ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో ఈ కార్డులు వృథాగా మారాయి. ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి. కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు పరవాడలో ఆస్పత్రి తప్పనిసరి.

– టి.మల్లేశ్వరరావు, కాంట్రాక్టు కార్మికుడు, ఫార్మాసిటీ

పోరాటానికి సిద్ధం



పారిశ్రామికవాడలోని కార్మికుల శ్రేయస్సు కోసం పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు ఆవశ్యకత చాలా ఉంది. ఈఎస్ఐ ఆస్పత్రి కోసం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. కార్మికుల చిరకాల కోర్కెను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– గనిశెట్టి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు, ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్

వీధి లైట్లు వెలిగించాలని వినతి

పరవాడ: అంధకారంలో అలమటిస్తున్న గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో వీధి దీపాలను వెలిగించేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. 520 ఇళ్ల కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేసి, వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేదన్నారు. చీకటి పడితే కాలనీలో అంధకారం అలముకుని, భయాందోళన కలిగిస్తోందన్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు నివేదించినా ఫలితం కానరాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలకు అమర్చిన వీధి దీపాలను వెలిగించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో మాణిక్యం కోరారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.



వినతిపత్రం చూపుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

గంజాయి అక్రమ రవాణాపై నిరంతర నిఘా

పెందుర్తి: గంజాయి నిర్మూలనలో భాగంగా గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వెస్ట్ జోన్ ఇన్‌చార్జి ఏసీపీ కాళిదాస్ తెలిపారు. పెందుర్తి సర్కిల్ పరిధిలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి నగరానికి తరలిస్తున్న గంజాయిని పట్టుకోవడంలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తగిన రీతిలో స్పందించి గంజాయితో పాటు ఇతర అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్, ఎస్‌ఐలు స్వామినాయుడు, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



పినగాడి చెక్ పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏసీపీ కాళిదాస్

బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందికి సత్కారం

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం సచివాలయంలో పనిచేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని గ్రామ సర్పంచ్ దాడి లావణ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. సర్వేయర్ ఎస్‌ఏఎస్‌వీ శ్రీనివాస్, డిజిటల్ అసిస్టెంట్ ఆర్ శివ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.రూప, ఏఎన్ఎం ఎస్.నారితల్లి, మహిళా పోలీస్ ఎం.విద్యాచక్రిక, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎ.ప్రభాగాయత్రిలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రాపేటి రాము, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు తదితరులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందిని శాలువాలతో సత్కరిస్తున్న దాడి లావణ్య, రాపేటి రాము తదితరులు

బాలికను కుటుంబానికి అప్పగించిన పోలీసులు

పెందుర్తి: తల్లిదండ్రులపై అలిగి ఇంట్లో నుంచి బయటకు వచ్చి అనాథలా తిరుగుతున్న ఓ బాలికకు పెందుర్తి పోలీసులు రక్షణ కల్పించారు. వారం రోజుల తరువాత ఆ బాలికను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలివి..

విజయనగరం జిల్లా శృంగవరపుకోట(ఎస్.కోట) సమీపంలోని కాశీపట్నానికి చెందిన ఓ బాలిక(12) ఈ నెల 13న వేపగుంట ప్రాంతానికి వచ్చి, అనాథగా తిరుగాడుతోంది. స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో బాలికను నగరంలోని చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. బాలికను విచారించగా తన వివరాలు చెప్పింది. ఈ క్రమంలో పోలీసులు బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సోమవారం బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

పోలీసుల చొరవతో.. కుటుంబం చెంతకు..

పెందుర్తి: తల్లిదండ్రులు మందలించారని ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిన ఓ మైనర్ బాలిక(16)ను పెందుర్తి పోలీసులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెంలో నివాసం ఉంటున్న ఓ మైనర్ బాలిక తన తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఈ నెల 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. దీనిపై కొత్తవలసతో పాటు, పెందుర్తి పోలీస్ స్టేషన్లలో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ దేముడుబాబు ఆధ్వర్యంలోని పెందుర్తి పోలీసుల బృందం నగరంలో గాలించగా నగరంలోని రైల్వే స్టేషన్‌లో సదరు బాలిక ఆచూకీ లభించింది. సోమవారం ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రీ పెయిడ్ స్టాండ్ సిద్ధం

దువ్వాడ ప్రయాణికులకు తప్పనున్న వసూళ్ల భారం

అగనంపూడి: ఎట్టకేలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మూడేళ్ల నుంచి దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రీపెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు, రైల్వే అధికారులను కోరుతూ వస్తోంది. రాత్రి సమయాల్లో కిలోమీటరు దూరానికి కూడా అధిక ధరలు వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు ఆర్థిక భారం మోయాల్సి వచ్చేది. ప్రత్యామ్నాయం లేక వారు అడిగిన డబ్బులు చెల్లించి గమ్య స్థానానికి చేరుకొనేవారు. ఈ నేపథ్యంలో దువ్వాడ ట్రాఫిక్ సీఐ వెంకటరావు చొరవ తీసుకొని అధికారులను సంప్రదించి ప్రీ పెయిడ్ఆటో స్టాండ్ ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించారు. భవన నిర్మాణం కూడా పూర్తయింది. త్వరలో ప్రారంభించడానికి చర్యలు చేపట్టడంతో ప్రయాణికులు, యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన ప్రీపెయిడ్ ఆటో స్టాండ్

నేడు పాదాలమ్మ, బంగారమ్మ పండగ



పాదాలమ్మ



బంగారమ్మ

సింహాచలం: సింహగిరి గ్రామదేవతలు పాదాలమ్మ, బంగారమ్మ పండగ మంగళవారం జరగనుంది. సింహగిరిపై కొలువుదేరిన అమ్మవార్ల పండగను స్థానిక గిరిజనులు, సింహగిరి నివాసితులు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి అమ్మవారి ఊరేగింపును సాంప్రదాయబద్ధంగా జరపనున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 5 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యం ముఠాపై చర్యలకు డిమాండ్

పరవాడ: కల్తీ మద్యంతో సంబంధమున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణంనాయుడు డిమాండ్ చేశారు. స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేసి, బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్న ముఠా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. పరవాడలో కల్తీ మద్యం తయారు చేసిన వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మద్యాన్ని నియంత్రిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం.. గుడి, బడి అనే తేడా లేకుండా వద్ద మద్యం అమ్మకాలు జరుపుతోందని ఆక్షేపించారు. ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్న మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయం జోలికి వెళ్లలేదు



హిందూ ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అమల

పెదగంట్యాడ: హిందూ ధర్మమన్నా.. ఆలయాలన్నా గౌరవం ఉందని తహసీల్దార్ అమల అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూలగొట్టేందుకు రెవెన్యూ సిబ్బంది వచ్చారని, భక్తులను భయభ్రాంతులకు గురి చేశారని చేసిన ప్రచారం వాస్తవం కాదన్నారు. విశ్వ హిందూ పరిషత్, హిందూ ధర్మ రక్ష సమితి, హిందు ధర్మ పరివార్ ప్రతినిధులు ఆలయాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సిబ్బంది ఆలయం జోలికి వెళ్లలేదన్నారు. ఆలయానికి ఆనుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే సమాచారంతో వెళ్లారన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగించలేదన్నారు. ఆలయం వద్ద ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ కోర్టు నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేసుకునే ఉద్దేశం ఉంటే కలెక్టర్‌కు విన్నవించుకోవాలని సూచించారు. లేకుంటే దేవదాయ శాఖాధికారులతో మాట్లాడుకోవాలన్నారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు, ఉద్యోగులు

స్మార్ట్ మీటర్లు అమర్చొద్దని ఆందోళన

పరవాడ: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల రద్దు డిమాండ్‌తో సిటు ఆధ్వర్యంలో మండల కాంప్లెక్స్ కూడలిలో గృహ వినియోగదారులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను గృహాలకు అమర్చవద్దని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బిగించిన స్మార్ట్ మీటర్ల వలన అధిక విద్యుత్ బిల్లులు వస్తుండడంతో గృహ వినియోగదారులు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఇంత వరకు వచ్చిన బిల్లులను రద్దు చేయాలన్నారు. గత ఎన్నికల సమయంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేసి విద్యుత్ బిల్లులు లేకుండా చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులను భారీగా పెంచడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లతోపాటు, విద్యుత్ సర్దుబాటు చార్జీలను కూడా రద్దు చేయాలన్నారు. ఆందోళనలో వి.అప్పలరాజు, పి.అప్పలనాయుడు, పెంటారావు పాల్గొన్నారు.



మండల కాంప్లెక్స్‌కూడలిలో ఆందోళన చేస్తున్న గృహ విద్యుత్ వినియోగదారులు

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 10 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.లక్ష జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ

అగనంపూడి: ఆపన్నులను ఆదుకోవడంలో సద్భావనా సేవా సంఘం కార్యదర్శి, 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) ముందువరుసలో ఉంటారని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు అన్నారు. సద్భావనా సేవా సంఘ ఆధ్వర్యంలో నిరుపేద మహిళ శేఖరమంత్రి వెంకటరమణమ్మ కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, పప్పులు, నూనె, ఇతర సామగ్రి అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి కిడిమి హనుమంతురావు, మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి యలమంచిలి అప్పారావు, కొల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు గెద్దాడ రమేష్, డాక్టర్ తాతాజీలు చెట్టుమీద నుంచి జారి పడి మంచానికే పరిమితమైన నిర్వాసితకాలనీకి చెందిన పీత రమణ కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, ఇతర వంట సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎంబీడీ గిరి, కడవల నాయుడు, ఆర్. రాము, పితాని భాస్కరరావు, బొంతు కనకరాజు, రాజు, సన్యాసి, దొమ్మేటి అప్పారావు, గుదే మహేష్, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ సరకులు అందిస్తున్న సద్భావన సేవా సంఘ కార్యదర్శి పూర్ణ